క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో రూ.19 కోట్లతో చేపట్టే అమృత్ 2.0 అభివృద్ధి పనులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ సోమవారం భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. అనంతరం జంగాల కాలనీని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమా ఆనంద్, కాంగ్రెస్ నాయకులు చెన్నారావు, సుబ్బారావు, నర్సింహారావు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, చెన్నారావు, సామేలు, కృష్ణ, సారధి పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలపై కళాజాతా

సత్తుపల్లి: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన సత్తుపల్లి మండలం గౌరిగూడెం, రేజర్ల గ్రామాల్లో సోమవారం ఆరోగ్య జాగ్రత్తలపై కళాజాతా నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శన ద్వారా వివరించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి అవినాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లోనే గర్భిణులు కాన్పులు చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మన ఊరు - మన బడి బిల్లులు ఇప్పించండి

బోనకల్: బీఆర్ఎస్ హయంలో మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి కొరకు ఖర్చు చేసిన బిల్లులను ఇప్పించాలని బోనకల్ పాఠశాల చైర్మన్ రాజు పేర్కొన్నారు. ఈ సదర్భంగా సోమవారం తహసీల్‌లో తహసీల్దార్ చందర్, ఎంఈఓ పుల్లయ్యలకు వినతిపత్రాలు అందించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ పేరుతో పనులు నిర్వహించి బిల్లులు రాక అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి

పెనుబల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూధన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెనుబల్లిలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకం పేరుతో పేద ప్రజలకు ఆత్మీయ భరోసా అందకుండా చేస్తున్నారని, ఇందిరమ్మఇండ్ల పేరుతో దోపిడీ జరుగుతుందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదని, దరఖాస్తుల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరసింమారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేష్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో హైవే మరమ్మతులు

కల్లూరు: కల్లూరు పట్టణంలోని హైవే రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ హైవే రోడ్డు పాత బస్టాండ్ నుంచి హిమాలయ రెస్టారెంట్ వరకు ఉంది. రోడ్డు మధ్యలో ఉబ్బెత్తుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. వాహనదారులు కిందపడి గాయాలపాలైన సంఘటనలు అనేకం. పలుమార్లు పత్రికలలో వార్తలు వచ్చినప్పటికీ స్పందించని హైవే అథారిటీ అధికారులు ఎట్టకేలకు స్పందించి మరమ్మతులు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సరఫరా నిలిపివేత

చింతకాని: మండలంలోని నేరడ గ్రామ సమీపంలో మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ ధ్వంసం కావడంతో మండలానికి తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎంపీడీఓ రామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయించి మంగళవారం సాయంత్రం నుంచి తాగునీటిని సరఫరా చేయటం జరుగుతుందని తెలిపారు.

కుమ్మరులకు ప్రాధాన్యత కల్పించాలి

వైరా: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమ్మరిల సమస్యల పరిష్కరించే వారికే తమ మద్దతు ఉంటుందని మెల్లమాంబ కమ్మరి శాలివాహన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సిలివేరు జనార్ధన్ అన్నారు. సోమవారం వైరాలో గుమ్మడిదల వెంకటనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కుమ్మరి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో కుమ్మరులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, భిక్షం, వీరబాబు, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తల్లాడ: ఎస్సీ వర్గీకరణ చట్ట బద్ధతకై ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పుల కార్యక్రమానికై సోమవారం తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నారపోగు వెంకటేశ్వరరావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వెంకటేష్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు నాగేశ్వరరావు, జేవిరీ, మహేష్, రవి, నరేష్, వెంకటి, జయరాజు, వీరబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా సౌరకాంతులు

పైలట్ ప్రాజెక్టుగా బోనకల్ మండలం ఎంపిక

- 'పీఎం సూర్యఘర్' కింద సోలార్ రూఫ్‌టాప్
- సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు
- సామాన్యులపై తగ్గనున్న కరెంట్ భారం



సర్వే నిర్వహిస్తున్న అధికారులు



బోనకల్: సోలార్‌తో మండలానికి సౌర వెలుగులు రానున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజక వర్గంపై తనదైన ముద్ర వేస్తూ నియోజకవర్గ అభివృద్ధికై వేలకోట్ల నిధులను మంజూరు చేస్తూ తన మార్కును చూపిస్తున్నాడు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరాతో పాటు ఉచితంగా అందించేందుకు మరో పథకానికి శ్రీకారం చుట్టాడు. పీఎంఎస్‌జీ (ప్రధాన మంత్రి సూర్యఘర్)సౌర విద్యుత్ పథకానికి సంబంధించి మొదటగా మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేశారు.

22 గ్రామాలకు ప్రయోజనం..

బోనకల్ మండలంలో 22 గ్రామాలను ఎంపిక చేస్తూ పైలట్ ప్రాజెక్టుగా బోనకల్ మండలాన్ని తీసుకున్నారు. గృహ వినియోగదారులకు సౌర విద్యుత్‌ను అందించేందుకు శరవేగంగా పనులు చేస్తున్నారు. మండలంలో మొత్తం 17,800 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. గత వారం రోజులుగా పలు మండలాల నుంచి కేటాయించిన విద్యుత్ సిబ్బంది టీమ్‌లుగా ఏర్పడి బోనకల్ మండలంలోని గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి విద్యుత్ సర్వీస్ వివరాలు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. సోలార్ విద్యుత్ వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ లక్ష్యాలను గ్రామంలో సభలు పెట్టి వివరిస్తున్నారు.

సర్వే నిర్వహిస్తున్న అధికారులు..

ఇప్పటి వరకు 5 వేల విద్యుత్ సర్వీసులకు సంబంధించి సర్వే పూర్తి కాగా మిగిలిన వాటిని సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో విద్యుత్ అధికారులు సర్వే పనులలో నిమగ్నమైయ్యారు. ప్రతి సర్వీసుకు సంబంధించి లబ్ధిదారుడి ఇంటి పైన సోలార్ ప్లేట్‌లను ఏర్పాటు చేసి 3 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకునే విదంగా సోలార్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇంటి పై బాగంలో విస్తీర్ణాన్ని బట్టి సోలార్ ప్లేట్‌లను అమర్చుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోలార్ విద్యుత్ వినియోగానికి సంబంధించి ప్రతి సర్వీసుకు ప్రత్యేకమైన మీటర్లను ఏర్పాటు చేసి వినియోగాన్ని బట్టి మిగిలిన విద్యుత్‌ను ఎన్‌పీడీసీఎల్‌కు వినియోగదారులు విక్రయించుకోవచ్చు. ఈ సోలార్ ఏర్పాటుకు ప్రతి సర్వీసుకు సంబంధించి రూ.2.50 లక్షలు ఖర్చు అవుతుందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని బోనకల్ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయడంతో గృహ వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధి చేకూరుతుంది..



ప్రభుత్వం ఉచితంగా సోలార్ విద్యుత్ కోసం ఎలాంటి ఖర్చు లేకుండా సోలార్‌లను ఏర్పాటు చేయడంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. సూర్యరశ్మి ద్వారా విద్యుత్‌ను సేకరించి ఇంటి అవసరాలకు వాడుకోగా మిగిలిన దానిని అమ్ముకోవడం ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– బందం ఉస్సేన్, గృహ వినియోగదారుడు, ముష్టికుంట్ల

సద్వినియోగం చేసుకోండి..



సోలార్ విద్యుత్ ఏర్పాటుకోసం బోనకల్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం మన అదృష్టం. ఉచితంగా ప్రతి సర్వీసుకు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ సిబ్బంది ఈ నెల 31లోగా సర్వే పూర్తిచేసేలా కృషిచేస్తున్నారు. ప్రతి ఇంటి గృహ అవసరాలకు 3యూనిట్లు వినియోగించుకోగా.. మిగిలిన విద్యుత్ ద్వారా వారికి ప్రయోజనం కలుగుతుంది.

– టి.మనోహర్, విద్యుత్ ఏఈ, బోనకల్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ముదిగొండ: దొంగతనాల నియంత్రణకు వ్యాపారస్తులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ మురళి అన్నారు. సోమవారం ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో మండలంలోని దుకాణాదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని, దొంగలు, కొత్త వ్యక్తులను గుర్తించి నేరాల అదుపునకు ఉపయోగపడుతుందని తెలిపారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు రక్షణగా ఉంటుందఅన్నారు. ఒక్క సీసీ కెమెరా ఐదుగురు కానిస్టేబుళ్లతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనంతరాములు, కానిస్టేబుళ్లు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మురళి

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



కొణిజర్ల: ఉత్తమ అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

కొణిజర్ల/కారేపల్లి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ పీఓ డాక్టర్ రాహుల్, ఖమ్మం ఆర్‌సీఓ నాగార్జునరావుల చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందుకున్న తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రజిత, ఏఓ చంద్రయ్య, జూనియర్ అసిస్టెంట్ గురుమూర్తిలను సోమవారం కళాశాలలో కళాశాల అధ్యాపకులు శాలువ, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. అదే విధంగా సింగరేణి మండలం లావుడ్యాతండా గిరిజన ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న కేలోతు రాములుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నవ్య, కోఆర్డినేటర్‌లు ఐశ్వర్య, రజిని, రాజేశ్వరి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: సత్తుపల్లి తెలంగాణ మైనార్టీ గురుకల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కత్తి వెంకట్రామయ్యకు గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డు లభించడంతో.. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. అదే విధంగా పెనుబల్లి తహసీల్దార్ గంటా ప్రతాప్ ఉత్తమ అధికారిగా ఎంపికై కలెక్టర్ చేతులమీదుగా అవార్డు తీసుకోవడంతో తహసీల్ సిబ్బంది, పలుశాఖల అధికారులు శాలువాలతో సత్కరించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ వితరణ

ఏన్కూరు: మండలంలోని నాచారం ఆరోగ్య ఉపకేంద్రానికి నాచారం యువత ఆధ్వర్యంలో మౌళిక సదుపాయాలు కల్పించారు. గ్రామానికి చెందిన యడ్లూరి చంద్రశేఖర్ ఫ్రిజ్ అందించగా.. వక్కంతుల నరేష్ వాటర్ ప్యూరిఫైడ్ అందించారు. వక్కంతుల నాగార్జున పీహెచ్‌సీకి టేబుల్ అందించడంతో పాటు నాచారం హైస్కూల్‌కు టీవీ వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు రాములు, మౌనిక, సీహెచ్‌ఓ శివరాజ్, దుర్గాప్రసాద్, స్వాతి, నిర్మల, లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుడి ఔదార్యం

ఏన్కూరు: మండలంలోని కొత్తమేడేపల్లి పాఠశాల విద్యార్థులకు గ్రామీణ వైద్యుడు షేక్ జానీ.. ప్లేట్లు, గ్లాసులు, చాపలను అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. 12 మంది గిరిజన చిన్నారుల గురుకుల ప్రవేశ పరీక్షలకు తన సొంత ఖర్చులతో దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న ఉపాధ్యాయులు

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం, ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో నాతో పాటుగా ఉపాధ్యాయులు తమ వంతు ఆర్థిక సాయం అందించగా.. విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామారావు, షకీలా, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మాధవి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన

మధిర/బోనకల్: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ.. సోమవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మధిర, బోనకల్ తహసీల్ వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి మాట్లాడారు. నూతన పెన్షన్ విధానంతో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం మధిర, బోనకల్ తహసీల్దార్లు రాళ్లబండి రాంబాబు, పున్నం చందర్ లకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, సుధాకర్, రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వరరావు, మదార్ సాహెబ్, కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు రవికుమార్, నాయకులు నరసింహారావు, అప్పారావు, రత్నకుమారి, శ్రీనివాసరావు, రవికుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మధిర: తహసీల్దార్ చందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కలెక్టర్‌కు వినతి

మధిర: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ.. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేకల రాజా సోమవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద గ్రీవెన్స్ డే లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

అదనపు కలెక్టర్‌కు..

కల్లూరురూరల్: మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచాలని కోరుతూ.. మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందించారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా ఒక్కొక్క విద్యార్థికి రూ.25లు చొప్పున చెల్లించాలని, ప్రభుత్వమే కోడిగుడ్లు సరఫరా చేయాలని, వంట కార్మికులను తొలగించకుండా జీఓ జారీ చేయాలని, ఎన్నికల హామీలో భాగంగా రూ.10వేలు చెల్లించాలని, అదే విధంగా 9 నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, మధ్యాహ్న భోజన కార్మికులు సత్యవతి, అప్పమ్మ, శారద, సుశీల, మార్తమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

మధిర: మధిర పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డులో సోమవారం ఎలక్ట్రీషియన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మధిర పట్టణ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎలక్ట్రికల్ వర్కర్లకి లేబర్ ఇన్సూరెన్స్ చేయించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రఘు, సుధాకర్, జాన్, నాగరాజు, అప్పారావు, అనీల్, ఆశీర్వాదం, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేత్రదానం

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్ గ్రామానికి చెందిన పరిమి రాఘవకుమార్ అనారోగ్యంతో సోమవారం మరణించారు. సప్తపది లయన్స్‌క్లబ్ సభ్యులు.. మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి వారి అంగీకారంతో నేత్రాలను సేకరించి ఖమ్మం నేత్రనిధికి పంపినట్లు క్లబ్ అధ్యక్షులు శ్రీధరాల సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ అబ్దుల్ సలాం, అనంత్, జయరాం, రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వెంగళరావునగర్‌లో గల శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి శివాలయంలో సోమవారం శివలింగానికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రామడుగు గురుబ్రహ్మాచార్యులు, పద్మ పాల్గొన్నారు.

హామీలను విస్మరించొద్దు..

కారేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించొద్దని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు అన్నారు. సోమవారం మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు గుగులోత్ శంకర్‌నాయక్(56) గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. శంకర్‌నాయక్ సీపీఐ విస్తరణకు విశేషంగా కృషి చేశారన్నారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఐ నాయకులు బాహ్‌సింగ్, మాంగు, కీల్యా, హరిసింగ్, రావూజీ, దశ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

పెనుబల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సోమవారం పెనుబల్లిలోని సిక్స్ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సదర్భంగా ఓపీ రిజిస్టర్లను పరిశీలించి రోగుల వివరాలను పూర్తిగా నమోదు చేయాలని ఆదేశించారు. రోగులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. ఆస్పత్రి సిబ్బంది పూర్తిస్థాయిలో విధులకు హాజరుకావడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ శ్రవంతి, డాక్టర్ రంజిత్ కుమార్, రాజా, రాజేశ్వరి, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

మానవ అక్రమ రవాణాను అరికడదాం



మాట్లాడుతున్న ఎస్సై అనంతరాములు

ముదిగొండ: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి సమష్టి కృషి చేయాలని ఎస్సై అనంతరాములు అన్నారు. సోమవారం ముదిగొండ హైస్కూల్‌లో స్కోప్ ఆర్డీ మై చాయిసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రాస్ రూట్ స్టేక్ హోల్డర్స్ వారు అక్రమ రవాణాపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా.. మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా నానాటికి పెరిగిపోతుందన్నారు. అందరం కలసి కట్టుగా ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెలితే మానవ అక్రమ రవాణా లేని, బాల్య వివాహాలు లేని, గృహ హింస నిర్మూలించబడిన గ్రామాలను నిర్మించడం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రవాణా దారుల పట్ల అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినా, ఇబ్బంది పెట్టినా పోలీస్ హెల్ప్ లైన్ 100కు డయల్ చేసి రక్షణ పొందాలని తెలిపారు. ఏమైన బాలల సమస్యలుంటే 1098కి ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమణయ్య, సీడీపీఓ శారదశాంతి, ముదిగొండ పాఠశాల హెచ్ఎం శాంతి, సైబర్ టెక్నాలజీ నిపుణుడు వెంకినాయుడు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

తల్లాడ/సత్తుపల్లిరూరల్: రోడ్డు భద్రత నిబంధనలు పాటించటం ప్రతీ ఒక్కరి భాధ్యత అని వైరా, సత్తుపల్లి ఎంవీఐలు వరప్రసాద్, జెఎన్.శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సోమవారం తల్లాడ మండలంలోని పినపాక డాన్‌బోస్కో పాఠశాలలో, సత్తుపల్లి శ్రీనారాయణ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి మాట్లాడారు. తప్పనిసరిగా లైసెన్స్ కల్గి ఉండటం, హెల్మెట్ దరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండటం, ఇన్సూరెన్స్ రెగ్యులర్‌గా రెన్యువల్ చేయటం వంటి రూల్స్ పాలించాలన్నారు. అతి వేగం ప్రమాదకరమని, నిదానమే ప్రధానమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐలు రవిచందర్, దినేష్, కానిస్టేబుల్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాళ్లు ప్రదీప్‌రెడ్డి, రాధాకృష్ణ, రామకృష్ణారెడ్డి, నవకుమార్, ఫాదర్లు పాల్గొన్నారు.



తల్లాడ: మాట్లాడుతున్న వైరా ఎంవీఐ వరప్రసాద్

బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సత్కారం



కౌన్సిలర్లను సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వైరా: వైరా మున్సిపాలిటీలో గత ఐదేళ్లుగా పదవీ బాధ్యతలు నిర్వహించిన మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, వివిధ వార్డు కౌన్సిలర్లు విశ్వేశ్వరరావు, పద్మజ, సునీత, లక్ష్మీరాజ్యం, పవిత్రకుమారి, చల్లగుండ్ల నాగేశ్వరరావు, తడికమళ్ల నాగేశ్వరరావు, వేణు, కొఆప్షన్ సభ్యులను బీఆర్ఎస్ పట్టణ కమిటీ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైరాలో సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవి, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, సక్కుబాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలు ప్రారంభం

మధిర: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల మధిరలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపులకు ఆన్‌లైన్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు ముస్లిం ఐక్య సంఘం మధిర సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ఉచితంగా సుశీల డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ముస్లిం సోదరులు వినియోగించుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం 9704484467 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైతుల ఖాతాల్లో 'భరోసా' నగదు జమ

మధిర: మధిర మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన చిలుకూరు గ్రామంలోని రైతుల ఖాతాలో రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6వేలు జమ అవుతున్నట్లు ఏఓ సాయి దీక్షిత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామంలోని అర్హులైన రైతులందరికీ రైతు భరోసా డబ్బులు జమ అయ్యాయన్నారు. పేర్కొన్నారు.

- **చింతకాని:** మండలంలోని రేపల్లెవాడ గ్రామంలోని 409మంది రైతులకు రైతు భరోసా పథకానికి అర్హులుగా గుర్తించడం జరిగిందని.. వారి ఖాతాల్లో రూ.56,94,672 నగదు జమ అయ్యాయని ఏఓ మానస సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేత్రదానం, రక్తదానంపై అవగాహన



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న సభ్యులు


బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెంలో పల్లె ప్రపంచం ఫౌండేషన్ చైర్మన్ కొండల్‌రావు యువతకు నేత్రదానం, రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేత్రదానం అమలులో చొప్పకట్లపాలెం ముందంజలో ఉందని, రక్తదానం ద్వారా మరోకరి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అనంతరం యువతకు టాలెంట్ టెస్ట్, క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శివనాగమణి, హనుమంతరావు, నాగేశ్వరరావు, రమాదేవి, అంజయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం మండలంలో విచిత్ర పరిస్థితి

పైలట్ ప్రాజెక్టుగా రెవెన్యూ గ్రామం కాకుండా జీపీ ఎంపిక

ఎర్రుపాలెం: నాలుగు పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం మండలానికి ఒక రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేసింది. ఎర్రుపాలెం మండలంలో మాత్రం రెవెన్యూ గ్రామమైన మామునూరు కాకుండా ఆ పరిధిలోని రాజులదేవరపాడు జీపీని జాబితాలో చేర్చారు. అయితే, సోమవారం రైతు భరోసా పథకం రాజులదేవరపాడు సహా మామునూరు, లక్ష్మీపురం, నర్సింహాపురం, బుచ్చిరెడ్డిపాలెం గ్రామ రైతుల ఖాతాల్లో జమ అయింది. ఇంత వరకు బాగానే ఉన్నా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డుల విషయానికొనిచ్చేసరికి రెవెన్యూ గ్రామమైన మామునూరు వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తొలుత తమ గ్రామ వాసులకు లబ్ధి జరగాల్సి ఉండగా రాజులదేవరపాడు పేరును జాబితాలో చేర్చడంతో పథకాలు అందే వరకు ఆలస్యం జరుగుతుందని చెబుతున్నారు. ఈవిషయమై జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్యను వివరణ కోరగా రైతు భరోసా పథకం రెవెన్యూ గ్రామ పరిధిలోని అన్ని జీపీల రైతులకు ప్రభుత్వం వర్తింపచేస్తోందని తెలిపారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కౌన్సిల్‌ను జయప్రదం చేయండి



చింతకాని: నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

వైరా/చింతకాని: ఫిబ్రవరి 4, 5 తేదీల్లో భద్రాచలంలో నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు పృథ్వీ పిలుపునిచ్చారు. సోమవారం వైరాలో, చింతకాని మండలంలోని నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కౌన్సిల్‌కు సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం పీడీఎస్‌యూ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రసాద్, శ్రీకాంత్, స్పందన, అనూష, అలేఖ్య నవీన్, ప్రసాద్, యశ్వంత్, పృథ్వీ, అనీల్, రాజేష్, వినయ్, సురేష్, ప్రదీప్, మహేష్ పాల్గొన్నారు.